ప్రజాశక్తి
శుక్రవారం 12 జూలై 2024



ట్రిపుల్ ఐటి మెరిట్ జాబితా విడుదల

శ్రీకాకుళం : రాజీవ్‌గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం ఆరు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ బిటెక్ కోర్సుకు సంబంధించిన ట్రిపుల్ ఐటి నాలుగు క్యాంపస్‌ల మెరిట్ జాబితాను ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.సి రెడ్డి గురువారం విడుదల చేశారు. అభ్యర్థుల మెరిట్ జాబితా ఆధారంగా నూజివీడు, శ్రీకాకుళం, ఆర్‌.కె వ్యాలీ, ఒంగోలు క్యాంపస్‌ల్లో నాలుగు వేల పైచిలుకు సీట్లు ఉన్నాయని తెలిపారు. ఆయా రిజర్వేషన్లను పాటిస్తూ విద్యార్థుల ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నట్లు చెప్పారు. విద్యార్థులు వారికి కేటాయించిన ప్రాంగణాల్లో కౌన్సెలింగ్ ప్రక్రియకు హాజరు కావాలని తెలిపారు. శ్రీకాకుళం ప్రాంగణానికి సంబంధించి 685 మంది విద్యార్థులు, 325 మంది విద్యార్థులు ప్రత్యేక కేటగిరీ కింద వంద మంది ఎంపికైనట్లు శ్రీకాకుళం ట్రిపుల్ ఐటి డైరెక్టర్ ప్రొఫెసర్ కె.వి.జి.డి బాలాజీ, పరిపాలనా అధికారి ముని రామకృష్ణ తెలిపారు.



నందిగాం : మాట్లాడుతున్న యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

సిలబస్ మార్పుతో విద్యార్థులకు నష్టం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - శ్రీకాకుళం, నందిగాం

పదో తరగతి విద్యార్థులకు మారిన సిలబస్‌లో ఉన్న కంటెంట్, పాఠాలు భవిష్యత్‌లో విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగపడే విధంగా లేవని, దీనివల్ల విద్యార్థులకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు తెలిపారు. పాఠశాలల్లో ఎన్‌రోల్‌మెంట్ ప్రక్రియను తెలుసుకునేందుకు జిల్లాలోని పలు మండలాల్లో గురువారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది మారిన పదో తరగతి సోషల్ పార్ట్ పుస్తకంలో 258 పేజీలు ఉంటే 167 పేజీలు యూరోపియన్ చరిత్రకు కేటాయించి, రాష్ట్ర చరిత్రకు అత్యంత తక్కువ పేజీలు ఇవ్వడం విద్యార్థులకు ఎలా ఉపయోగమో చెప్పాలన్నారు. గతేడాది తొమ్మిదో తరగతి హిందీ పుస్తకం చాలా ఇబ్బందికరంగా ఉందని, ఉపాధ్యాయులూ అర్థం చేసుకోలేని ఉత్తర భారతదేశం మాండలికాలు ప్రవేశపెట్టడం వల్ల గందరగోళంగా ఉందన్నారు. ఇదే విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఈ ఏడాది అదే పద్ధతిలో ముద్రించడం విద్యార్థులకు హిందీ భాషపై ఆసక్తి తగ్గించే ప్రక్రియలో భాగంగానే భావించాల్సి వస్తోందని చెప్పారు. భౌతికశాస్త్రంలో మూలకాల వర్గీకరణ, పరమాణు నిర్మాణం, రసాయన బంధం వంటి పాఠాలు తొలగించడం దారుణమన్నారు. పిల్లలకు శాస్త్రీయమైన దృక్పథాన్ని అలవర్చే పాఠ్యాంశాలను తీసివేయడం సరికాదన్నారు. గణిత సబ్జెక్టులో భవిష్యత్ పోటీ పరీక్షలకు సిద్ధపడే విద్యార్థులకు ఉపయోగపడే విధంగా లేవని తెలిపారు. ఇప్పటికైనా పాత పాఠ్యాంశాలను తిరిగి చేర్చాలని, పిల్లల్లో సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించే పాఠ్యాంశాలను తొలగించడం సరికాదన్నారు. యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్ కుమార్ మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాల వ్యవస్థ అస్తవ్యస్తంగా తయారైందని విమర్శించారు. ఇందుకు గత ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత, ఏకపక్ష విధానాలు ఒక కారణం కాగా, కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం వెంటనే స్పందించి 117 జిఒను రద్దు చేయడం, సమాంతర మీడియంలను కొనసాగించడం, ప్రాథమిక పాఠశాల కొనసాగింపుపై తక్షణ ప్రకటన చేయకపోవడం మరో కారణమన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వ విద్యను కాపాడుకునేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ జిల్లాలో పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య కోసం ఉపాధ్యాయులు అవసరమైతే గంట సమయాన్ని అదనంగా కేటాయించాలని కోరారు. విద్యార్థులందరికీ చదవడం, రాయడం నేర్పించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు కె.దాలయ్య, జిల్లా కార్యదర్శి వై.వాసుదేవరావు, నందిగాం మండల అధ్యక్ష, కార్యదర్శులు కుమారస్వామి, గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.



సముద్రంలో చేపల వేటపై ఉన్న నిషేధం ఎత్తివేసి నెల రోజులు కావస్తోంది. మత్స్యకారులకు అందాల్సిన పరిహారం నేటికీ వారి ఖాతాల్లో జమ కాలేదు. ఏటా ఏప్రిల్ 15 నుంచి జూన్ 14 వరకూ 61 రోజుల పాటు చేపల వేటపై ప్రభుత్వం నిషేధం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. గత నెల 15వ తేదీన చేపల వేటపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం తొలగించింది. అప్పట్నుంచి మత్స్యకారులు డబ్బుల కోసం ఎదురుచూస్తూనే ఉన్నారు. గతేడాది మే 16వ తేదీనే డబ్బులు జమ చేయగా, ఈసారి సార్వత్రిక ఎన్నికల కోడ్ నేపథ్యంలో కొంత జాప్యం చోటుచేసుకుంది. ఈనెల రెండో తేదీన అధికారులు ప్రాథమిక జాబితాను సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. జాబితాకు ఆమోదం తెలిపి ఇక డబ్బులు రావడమే తరువాయి అనుకున్న తరుణంలో లబ్ధిదారుల సర్వే మరోసారి చేయాలని ప్రభుత్వం ఆదేశించడంతో పరిహారం మరింత జాప్యమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పరిహారం పడేదెప్పుడు..?

- జూన్ 15న చేపల వేట నిషేధం ఎత్తివేత
- నేటికీ జమ కాని డబ్బులు
- రీ సర్వే చేయాలంటూ ప్రభుత్వం ఆదేశం
- పరిహారం మరింత జాప్యమయ్యే అవకాశం

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వేట నిషేధ భృతి కోసం మత్స్యకారులు మరికొద్ది రోజులు ఆగాల్సిన పరిస్థితి తలెత్తింది. పరిహారం జాబితాపై మరోసారి సర్వే చేసి 20 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. జిల్లాల నుంచి నివేదికలు ప్రభుత్వానికి చేరడం, వాటికి ఆమోదం తెలపడం తదితర ప్రక్రియలు పూర్తికావడానికి మరో పది, 15 రోజులు పట్టే అవకాశం ఉంది. ఏవిధంగా చూసుకున్నా ఆగస్టు నెలాఖరుకు మత్స్యకారులు నిరీక్షించక తప్పేలా లేదు. ఎన్నికల కోడ్ ఫలితంగా లబ్ధిదారుల ఎంపిక సర్వేలో ఈ ఏడాది కొంత జాప్యం చోటుచేసుకుంది. మత్స్యకారులకు ఇబ్బంది కలగకూడదనే ఉద్దేశంతో ప్రభుత్వం ఎన్నికల సంఘం అనుమతులు తీసుకుని ఈ ఏడాది మే రెండో తేదీన సర్వే నిర్వహించింది. మే మూడు, నాలుగు తేదీల్లో డేటా వెరిఫికేషన్, నమోదు చేశారు. మే ఆరు నుంచి పదో తేదీ వరకు లబ్ధిదారుల వివరాలను నవశకం పోర్టల్‌లో అప్‌లోడ్ చేశారు. మే 14న సచివాలయాల్లో జాబితాలను ప్రదర్శించారు. మే 15 నుంచి 17వ తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించారు. మే 18, 19 అభ్యంతరాలను పరిష్కరించారు. మే 22న లబ్ధిదారుల వడపోత, జాబితా తయారీ చేపట్టారు. గత నెల రెండో తేదీ నాటికి ప్రాథమిక జాబితా పూర్తయింది. ఆ జాబితా ప్రకారం జిల్లాలో 15,375 మంది మత్స్యకారులను సర్వే చేశారు. వీరిలో ప్రాథమికంగా 12,952 మందిని అర్హులుగా గుర్తించారు. మత్స్యకార భరోసాకు గత ప్రభుత్వం విధించిన రకరకాల కారణాలతో 2,423 మందిని అనర్హులుగా పెండింగ్‌లో ఉంచారు. వీటిని కొత్త ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన తర్వాత పరిహారం చెల్లింపుపై ఒక స్పష్టత వస్తుందని అధికారులు చెప్తున్నారు.

పరిహారం చెల్లింపునకు డీజిల్ వాడకం మెలిక

మత్స్యకార భరోసా చెల్లింపునకు ప్రభుత్వం ఈసారి కొత్తగా డీజిల్ వాడకాన్ని మెలిక పెట్టింది. మత్స్యకారుల బోట్లకు ప్రభుత్వం ఏడాదికి లీటరుకు రూ.9 చొప్పున సబ్సిడీతో 300 లీటర్ల డీజిల్‌ను అందిస్తోంది. కనీసం వంద లీటర్లనూ వినియోగించని వారిని అనర్హులు జాబితాలో చేర్చినట్లు తెలుస్తోంది. పెండింగ్ జాబితాలో ఉన్న 2,423 మందిలో సుమారు 1890 మందిని ఈ నిబంధనతోనే అనర్హులుగా మారినట్లు తెలుస్తోంది. గతేడాది ఈ నిబంధన ఉన్నా మొదటిసారి మినహాయింపు ఇచ్చారు. ఈ సంవత్సరం దాన్ని అమలు చేయాలని నిర్ణయించి అందుకనుగుణంగా జాబితాను తయారు చేశారు. వాస్తవానికి ఇందులో ప్రభుత్వ తప్పిదమే కనిపిస్తోంది. మత్స్యకారులకు సబ్సిడీపై డీజిల్ అందించేందుకు ప్రభుత్వం ప్రతి జిల్లాలో ప్రత్యేకంగా పెట్రోల్ బంకులను గుర్తించింది. ప్రభుత్వం కొందరు బంకు యజమానులకు సబ్సిడీ డబ్బులు సకాలంలో విడుదల చేయకపోవడం, టెక్నికల్ కారణాలతో డీలర్లు మత్స్యకారులకు డీజిల్ అందించేందుకు నిరాకరించారు. దీంతో వారు వేరే బంకుల్లో నుంచి కొనుగోలు చేసి చేపల వేటకు వెళ్లారు. ప్రభుత్వ తప్పిదంతో తమను అనర్హులుగా చేయడమేమిటని మత్స్యకారులు ప్రశ్నిస్తున్నారు.

నిబంధనలతో 533 మంది అనర్హులు

మత్స్యకార భరోసాకు ఐదేళ్లుగా వైసిపి ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలనే ఎన్నికల సమయంలో ఉన్న ప్రభుత్వమూ అమలు చేసింది. పరిహారం కోసం 18 నుంచి 60 ఏళ్ల వయసు, కుటుంబంలో ఒకరికి మాత్రమే సాయం, మత్స్యకార పెన్షన్ పొందుతున్న వారిని వడపోశారు. పల్లం భూమి మూడు ఎకరాలు గానీ మెట్టు పది ఎకరాలకు మించి ఉన్న వారిని, నాలుగు చక్రాల వాహనాలు కలిగి ఉన్న వారిని కుటుంబ విద్యుత్ వినియోగం 300 యూనిట్లకు మించి వాడిన వారిని అనర్హుల జాబితాలో చేర్చారు. కుటుంబంలో ప్రభుత్వ శాఖలు, కార్పొరేషన్లలో పనిచేసే ఉద్యోగులు ఉంటే వారిని అనర్హులని స్పష్టం చేసింది. కుటుంబంలో ఎవరైనా ఆదాయపు పన్ను చెల్లిస్తుంటే వారికీ పథకం వర్తింపజేయలేదు. ఈ నిబంధనలతో 533 మందిని పక్కనపెట్టారు. వేట నిషేధ పరిహారానికి నిబంధనలు తొలగించి చేపల వేటకు వెళ్లే ప్రతి మత్స్యకారునికీ కొత్త ప్రభుత్వం పరిహారం అందించాలని కోరుతున్నారు.

ఉద్యోగులు, పెన్షనర్లపై కేంద్రం నిర్లక్ష్యం

ఎఐబిడిపిఎ జిల్లా మహాసభలో రాష్ట్ర కార్యదర్శి కె.సి బోస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

బిఎస్ఎన్ఎల్ సంస్థలో పనిచేస్తున్న ఉద్యోగులు, పెన్షనర్లపై కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆలిండియా బిఎస్ఎన్ఎల్-డిఒటి పెన్షనర్ల అసోసియేషన్ (ఎఐబిడిపిఎ) రాష్ట్ర కార్యదర్శి కె.సి బోస్, రాష్ట్ర సహాయ కార్యదర్శి రామారావు విమర్శించారు. కొన్నేళ్లుగా మూడో వేతన సవరణ చేపట్టకుండా అన్యాయం చేస్తోందన్నారు. నగరంలోని యుటిఎఫ్ జిల్లా కార్యాలయంలో ఎఐబిడిపిఎ జిల్లా నాలుగో మహాసభ గురువారం నిర్వహించారు. ముందుగా జాతీయ పతాకాన్ని, యూనియన్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం సభలో వారు మాట్లాడుతూ వేతన సవరణ కోసం ఉద్యోగులు, పెన్షనర్లు సమిష్టి ఉద్యమాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పెన్షనర్లు అనేక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారని, వాటిని పరిష్కరించడంలో యాజమాన్యం, ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. సుదీర్ఘకాలం పాటు సంస్థ అభ్యున్నతి కోసం పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన పెన్షనర్లపై అనుసరిస్తున్న తీరు సరికాదన్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం బిఎస్ఎన్ఎల్ సంస్థను నిర్వీర్యం చేస్తూ కార్పొరేట్ కంపెనీలకు 4జి, 5జి సేవలను విస్తృతానికి, ఇష్టారాజ్యంగా టారిఫ్‌లను పెంచుకునేందుకు అనుమతులు ఇస్తోందని విమర్శించారు. బిఎస్ఎన్ఎల్ సంస్థ ఎంతో సామర్థ్యం కలిగి ఉన్నా 4జి, 5జి సేవలకు మోకాలడ్డుతోందన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

ఎఐబిడిపిఎ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కె.గోపాలరావు, కార్యదర్శిగా వెంకటరావు పాణిగ్రహి, సహాయ కార్యదర్శిగా ఎం.గోవర్ధనరావుతో పాటు 17మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు. ఆ సంఘ జిల్లా ఉపాధ్యక్షులు రాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన మహాసభలో పోస్టల్ ఎంప్లాయీస్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.గణపతి, పోస్టల్ పెన్షనర్ల సంఘం నాయకులు చంద్రశేఖర్, రైల్వే ఉద్యోగుల సంఘం నాయకులు కె.సూరయ్య, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, నగర కన్వీనర్ ఆర్.ప్రకాశరావు, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి పి.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.



మహాసభలో మాట్లాడుతున్న బోస్

జనాభా నియంత్రణతో జీవన ప్రమాణాల మెరుగు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దేశ ఆర్థికాభివృద్ధిలో మానవ వనరుల ప్రాముఖ్యం ఎక్కువని, జనాభా తక్కువ ఉన్న దేశాల్లో జీవన ప్రమాణాలు ఎంతో మెరుగ్గా ఉంటాయని జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి బి.మీనాక్షి అన్నారు. ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా గురువారం నిర్వహించిన ర్యాలీని జిల్లా వైద్యారోగ్యశాఖ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ చిన్న కుటుంబం చింతలు లేని కుటుంబమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పిలుపునిస్తున్నాయని, ఆ దిశగా వైద్యులు, సిబ్బంది కృషి చేయాలని పిలుపునిచ్చారు. ప్రపంచ జనాభా 800 కోట్లు ఉండగా ఒక్క భారతదేశంలోనే 142 కోట్ల మంది ఉన్నారని, జనాభా నియంత్రణకు కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉందన్నారు. జనాభా నియంత్రణ అనేది సామాజిక బాధ్యతగా గ్రహించి ముందుకొచ్చి జనాభా నియంత్రణకు కృషి చేయాలని కోరారు. 25 నుంచి 60 ఏళ్ల లోపు వయసు వారు 60 శాతం మనదేశంలో ఉన్నారని వీరందరికీ పని కల్పించి, మానవ వనరులను సక్రమంగా వాడుకోవడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆరోగ్య సంరక్షణ, నాణ్యమైన విద్య, ఉద్యోగాల నైపుణ్యం కోసం జనాభా నియంత్రణ అత్యవసరమన్నారు.

జిల్లాలో కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు అనుకున్నంత స్థాయిలో జరగడం లేదన్నారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు ప్రోత్సహించడంలో ఉత్తమ సేవలందించిన వారికి నగదు పారితోషికం ఇస్తున్నట్లు తెలిపారు. పురుషులకు చేసే వేసక్టమీ ఆపరేషన్ చాలా సులువని... గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో దీనిపై అవగాహన కల్పించాలని సూచించారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించుకున్న లబ్ధిదారులకు రూ.ఐదు వేల చెక్కును అందజేశారు. కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన డాక్టర్ ఎన్.శేషగిరికి రూ.7 వేలు, డాక్టర్ గురుమూర్తికి రూ.ఐదు వేలు, ఉత్తమ గైనకాలజిస్టులు డా.అనూషకు రూ.ఎనిమిది వేలు, జ్ఞాన ప్రసూనాంబకు రూ.ఐదు వేలు పారితోషికం అందజేశారు. జనాభా నియంత్రణపై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో జెమ్ నర్సింగ్ కాలేజ్, అవని నర్సింగ్ కాలేజ్, నారాయణ నర్సింగ్ కాలేజ్ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో డిప్యూటీ డిఎంహెచ్‌ఒ సి.పి శ్రీదేవి, డిపిఎంఒ జి.వి లక్ష్మి, సుజాత, సమాజ సేవకులు మంత్రి వెంకటస్వామి, డెప్యూటీ డెమో మహంతి వెంకటేశ్వరరావు, గణాంకాధికారి రామనాగేశ్వరరావు, సూర్యకళ, విజయలక్ష్మి, మోహిని తదితరులు పాల్గొన్నారు.



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డిఎంహెచ్‌ఒ మీనాక్షి



విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

గురుకుల పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - పాతపట్నం

పాతపట్నంలోని బాలయోగి గురుకుల పాఠశాలను కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. వంటగది నిర్వహణ సరిగా లేకపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. శుభ్రం చేయాలని సిబ్బందికి సూచించారు. సీజనల్ వ్యాధులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని ప్రిన్సిపాల్‌కు సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటి ఆర్‌ఒ ప్లాంట్ నీరు సరిగా రావడం లేదని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అనంతరం పాతపట్నం సామాజిక ఆస్పత్రిని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఆస్పత్రిలో ప్రసవాల సంఖ్యను పెంచాలని వైద్యులకు సూచించారు. అంబులెన్స్ సేవలను మెరుగుపరచాలన్నారు. గిరిజన గ్రామాల నుంచి వచ్చే రోగులకు మెరుగైన వైద్యం అందించే ఆస్పత్రిగా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ వై.ఎస్.ఎస్ ప్రసాద్, రెవెన్యూ, విద్య, వైద్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

మున్సిపాల్టీ నిధులు దుర్వినియోగం

ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజాశక్తి - ఆమదాలవలస

వైసిపి ప్రభుత్వ హయాంలో మున్సిపాల్టీలో నిధుల దుర్వినియోగం జరిగిందని ఎమ్మెల్యే కూన రవికుమార్ విమర్శించారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సుడా, పబ్లిక్ హెల్త్, మున్సిపల్ సిబ్బందితో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. వైసిపి ప్రభుత్వంలో అప్పటి స్పీకర్ తమ్మినేని సీతారాం ఇంటి వద్ద 12 మంది మున్సిపల్ సిబ్బందిని కేటాయించారని, మున్సిపల్ నిధులు జీతాలుగా చెల్లించి రూ.1.20 లక్షలు దుర్వినియోగం చేశారని అధికారులపై మండిపడ్డారు. ఇంజినీరింగ్ అధికారులు ఐదేళ్లలో చేపట్టిన పనులు, నిధుల చెల్లింపుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం మున్సిపల్ ఖాతాలో సాధారణ నిధులు రూ.19.5 లక్షలు ఉండడంపై అసహనం వ్యక్తం చేశారు. 2023-24 సంవత్సరంలో రూ.3.67 కోట్ల రాబడి వస్తే, రూ.ఐదు కోట్ల బిల్లులు ఎలా చేశారని ప్రశ్నించారు. మున్సిపాలిటీలో నెలకొన్న సమస్యలు పరిష్కరించలేకపోయారని, ఇది సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మున్సిపాలిటీ పరిధిలోని దళితవాడల్లో పలు అభివృద్ధి పనులు చేపట్టినట్లు రికార్డుల్లో ఉన్నాయని, వాటికి సంబంధించి కాంట్రాక్టర్లు నేటికీ బిల్లులు అడగలేదా అని ఎఇ అప్పలనాయుడును ప్రశ్నించగా, ఆయన మౌనం వహించారు. రూ.ఆరు కోట్ల మున్సిపల్ నిధులు ఉండగా 2019 ముందు పలు అభివృద్ధి పనులు చేసిన కాంట్రాక్టర్ల బిల్లులు చెల్లింపులు చేపట్టకుండా, కొత్తగా పనులు ఎలా చేయించారని ప్రశ్నించారు. ప్రస్తుతం మున్సిపాలిటీ పరిధిలో చేపడుతున్న ఉపయోగం లేని పనులను వెంటనే నిలిపివేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. పారిశుధ్య సిబ్బందిని వేధించడం మాని వారితో పనిచేయించుకుని పట్టణ పరిశుభ్రతకు పాటుపడాలని అధికారులకు సూచించారు. కంద్రపేటలో ప్రజా మరుగుదొడ్లు అధ్వానంగా ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ జి.రవి, పబ్లిక్ హెల్త్ ఇఇ పి.సుగుణాకర్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తమ్మినేని గీతా విద్యాసాగర్, టిడిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి జల హారతి

వజ్రపుకొత్తూరు : వైసిపి ఐదేళ్ల విధ్వంస పాలనలో సాగునీటి వనరులు పూర్తిగా నిర్వీర్యమయ్యాయని ఎమ్మెల్యే గౌతు శిరీష విమర్శించారు. మండలానికి వంశధార నీరు చేరిన సందర్భంగా పొల్లాడ నల్ల చెరువులో ఎమ్మెల్యే గురువారం జల హారతి ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసిపి ఐదేళ్ల పాలనలో వంశధార నీరందక రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా సకాలంలో వంశధార సాగునీరు అందించడానికి తనవంతు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యేగా తన పదవీ కాలంలో 90 శాతం పనులు పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు సూరాడ మోహనరావు, మాజీ ఎంపిపిలు మల్లా సూర్యం, జి.వసంతస్వామి, మాజీ సర్పంచ్ అట్టాడ రఘు, టిడిపి నాయకులు పుచ్చ ఈశ్వరరావు, పి.విఠల్, బి.శశిభూషణ్, దువ్వాడ జయరాం చౌదరి, కొల్లి రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జలహారతి ఇస్తున్న ఎమ్మెల్యే శిరీష

సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలి

మంత్రిని కోరిన ఎన్‌జిఒ నాయకులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం చొరవ చూపేలా కృషి చేయాలని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును ఎపి ఎన్‌జిఒ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కె.శివారెడ్డి, చౌదరి పురుషోత్తంనాయుడు కోరారు. విజయవాడలో మంత్రిని గురువారం కలిసి ఉద్యోగులకు ఒకటో తేదీన జీతాలు చెల్లించడంపై కృతజ్ఞతలు తెలిపారు. శాలువ కప్పి సత్కరించారు. రాష్ట్ర ప్రజలతో పాటు ప్రభుత్వంలో భాగస్వామ్యమైన ఉద్యోగులు కొత్త ప్రభుత్వంపై కోటి ఆశలు పెట్టుకున్నారని, సమస్యలను పరిష్కరించేందుకు అడుగులు వేసి ఉద్యోగుల్లో ఆత్మగౌరవాన్ని పెంపొందించాలని కోరారు. ఉద్యోగులకు 12వ పిఆర్‌సి అమలు, పెండింగ్‌లో ఉన్న డిఎలు, ఆర్థిక ప్రయోజనాల మంజూరు, ప్రతినెలా మొదటి ప్రాధాన్యతగా అంగన్వాడీ, అవుట్‌సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులు, ఆశావర్కర్లు, పెన్షనర్లకు వేతనాలు చెల్లించాలన్నారు.

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ

(ప్రభుత్వ రంగ సంస్థ)

ఇ-ప్రొక్యూర్మెంట్ టెండర్ ప్రకటన

SHT No. 01/2024 -25/IDC/EE/SKL/DB/AE/ Transformers/2024-25/88/ Dt. 09.07.2024

శ్రీకాకుళం జిల్లాలో టెక్కలి మరియు సారవకోట మండలం లలో, వంశధార ఎడమ ప్రధాన కాలువ మీద నిర్మించిన మధనగోపాలసాగరం, తొగిరి ఎత్తిపోతల పథకములకు సంబంధించిన ట్రాన్స్ ఫార్మర్ల మరమ్మత్తులు మరియు భర్తీ పనులు చేపట్టుటకు గాను ఆన్ లైన్ టెండర్లు కోరబడుచున్నవి. టెండరు డాక్యుమెంట్ లభించు తేది.12.07.2024 ఉ॥ 10.00 గం॥ ల నుండి.

తదుపరి పూర్తి వివరములకు కార్యనిర్వాహక ఇంజనీర్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నీటి పారుదల అభివృద్ధి సంస్థ, శ్రీకాకుళం విభాగం మరియు
వెబ్ సైట్: https://tender.apeprocurement.gov.in (లేదా)
సెల్ నెం: 7382625665 లో సంప్రదించగలరు.

కార్యనిర్వాహక ఇంజనీరు, అం.ప్ర.రా.నీ.పా.అ. సంస్థ, శ్రీకాకుళం.

IN THE HONOURABLE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM I.A 270/2022 in O.S. 28/2022

Between:
Sirra.Sai Kiran, S/o Late Madhava rao,aged 30 years,, resident of D.No.1-1, Main veedhi Gajulakollivalasa Village, Amadalavalasa, Mandal, Srikakulam, Dist. **...Petitioners/Plaintiff**
And:
1. Sirigidi Duraga, W/o Apparao, aged 47 years, resident of D.No 2-5, Kamireddy peta Hamlet of Gajula Kollivalasa,Amadalavalasa Mandal, Srikakulam Dist.
2. Pandiripilli Narasamma@Pottamma, W/o Atchuyutarao, age 44 years, resident of D.No:2-5,Kamireddyeta vill, Hamlet of Gajula Kollivalasa, Amadalavalasa Mandal, Srikakulam Dist
3. Pasupureddy Kalavathi, W/o Rama Krishna, aged 36 years, resident of D.No 2-5, Kamireddy pet vill, Hamlet of Gajula Kollivalasa, Amadalavalasa Mandal, Srikakulam Dist.
4. Allada Laxmi, W /o Narayana rao, aged 40 years, resident of D.No 2-5, Kamireddy peta vill Hamlet of Gajula Kollivalasa,Amadalavalasa Mandal, Srikakulam Dist.
5. Devisetti Naga ratnam, W/o Venu aged 34 years,residentofD.No 2-5, Kamireddy peta, vill Hamlet of Gajula Kollivalasa,Amadalavalasa Mandal, Srikakulam Dist.
...Respondent/Defendants

NOTICE

It is informed that the above matter I.A 270/2022 in O.S28/2022 on the file of Honourable Additional Senior Civil Judge Court at Srikakulam. Is stands posted on **26-07-2024** for appearance Respondents 1 to3 and 5 and you are to appear on afore said date before the Honourable Additional Senior Civil Judge Court at Srikakulam about **at 10.30 AM,** in person or through pleader other wise the above matter will decide against them. Hence this notice.

GONDU JANARDHANA RAO
Advocate for petitioner,
SRIKAKULAM, CELL NO. 9849196744.

IN THE HONOURABLE COURT OF THE ADDL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM O.S. 28/2022

Between:
Sirra.Sai Kiran S/o Late Madhava rao,aged 30 years,, resident of D.No.1-1, Main veedhi Gajulakollivalasa Village, Amadalavalasa, Mandal, Srikakulam, Dist. **...Plaintiff**
And:
1. Sirigidi Duraga, W/o Apparao, aged 47 years, resident of D.No 2-5, Kamireddy peta Hamlet of Gajula Kollivalasa,Amadalavalasa Mandal, Srikakulam Dist.
2. Pandiripilli Narasamma@Pottamma, W/o Atchuyutarao, age 44 years, resident of D.No:2-5.Kamireddyeta vill, Hamlet of Gajula Kollivalasa, Amadalavalasa Mandal, Srikakulam Dist
3. Pasupureddy Kalavathi, W/o Rama Krishna, aged 36 years, resident of D.No 2-5, Kamireddy pet vill, Hamlet of Gajula Kollivalasa, Amadalavalasa Mandal, Srikakulam Dist.
4. Allada Laxmi, W /o Narayana rao, aged 40 years, resident of D.No 2-5, Kamireddy peta vill Hamlet of Gajula Kollivalasa,Amadalavalasa Mandal, Srikakulam Dist.
5. Devisetti Naga ratnam W/o Venu aged 34 years,residentofD.No 2-5, Kamireddy peta, vill Hamlet of Gajula Kollivalasa, Amadalavalasa Mandal, Srikakulam Dist. **... Defendants**

NOTICE

It is informed that the above matter O.S 28/2022 on the file of Honourable Additional Senior Civil Judge Court at Srikakulam. Is stands posted on **26-07-2024** for appearance defendants 1 to3 and 5 and you are to appear on afore said date before the Honourable Additional Senior Civil Judge Court at Srikakulam about **at 10.30 AM,** in person or through pleader other wise the above matter will decide against them. Hence this notice.

GONDU JANARDHANA RAO
Advocate for petitioner,
SRIKAKULAM, CELL NO. 9849196744.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గౌతు శిరీష

గత ప్రభుత్వంలో సాగునీటి ఊసే లేదు

ఎమ్మెల్యే గౌతు శిరీష

ప్రజాశక్తి- పలాస

గత ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు నియోజకవర్గంలో దోచుకోవడానికే ప్రయత్నం చేసేరే తప్ప రైతులకు అవసరమైన వంశధార సాగునీటిని అందించడంలో విఫలమయ్యారని ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో వంశధార కాలువ పరిధిలోని రైతులతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తాను అధికారంలోకి వచ్చిన వెంటనే ఎన్నికల హామీలో ఇచ్చిన మాటకు కట్టుబడి వంశధార కాలువ ద్వారా శివారు భూములకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. ప్రతి సమస్యా తమ సమస్యగా భావించి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. గత ప్రభుత్వంలా అవినీతి మరకలు మనపై వదకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ముందుకు పోవాలని కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, టిడిపి మండల అధ్యక్షులు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



విచారణ చేస్తున్న డిప్యూటీ డిఇఒ విలియం

ఉపాధ్యాయులపై విచారణ

ప్రజాశక్తి- పలాస

మండలంలోని పెదంచల, కాశీబుగ్గ ఉన్నత పాఠశాలల్లో ఉపాధ్యాయులుగా పనిచేసిన బి.మాధవరావు, టి.మన్మథరావులు ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న సందర్భంగా అప్పటి అధికారులు సస్పెండ్ చేశారు. ఈ మేరకు ఎంఆర్‌సిలో టెక్కలి డిప్యూటీ డిఇఒ విలియం ఉపాధ్యాయుల సస్పెండిపై గురువారం విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో జరిగిన సంఘటనలను పలాస ఎంఇఒ శ్రీనివాసరావు ప్రాథమిక విచారణ చేపట్టారని అన్నారు. ఇప్పుడు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పూర్తిస్థాయిలో విచారణ చేపట్టామని, ఈ నివేదికను జిల్లా అధికారులకు అందజేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఎంఇఒ శ్రీనివాసరావులు దష్టికి తీసుకు వెళ్తానని తెలిపారు. ఆయనతో పాటు ఎంఇఒలు సిహెచ్.శ్రీనివాసరావు, చెరుకునల్లి సత్యం ఉన్నారు.

కొనసాగుతున్న దీక్షలు

కవిటి: తరగతి ధ్రువీకరణ పత్రాలు లేకపోవడంతో తమ భవిష్యత్ భరోసా కోసం బెంతు ఒరియాలు కవిటిలో చేస్తున్న రిలే నిరాహారదీక్షలు 198వ రోజుకి చేరుకున్నాయి. అందులో భాగంగా గురువారం దీక్షలో యువత, పెద్దలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడుతూ తమకు గుర్తింపు లభించేవరకూ, తమ బిడ్డల భవిష్యత్‌కు భరోసా దక్కేవరకు తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

ట్రిపుల్ ఐటిలో మెరిసిన విద్యార్థులు



రణస్థలం : ఎంపికైన విద్యార్థులు

మెళియాపుట్టి : మండలంలో 16 మంది విద్యార్థులు ట్రిబుల్ ఐటికి ఎంపికయ్యారని ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనాభరావు తెలిపారు. మండలంలోని పెద్దమడి, నలుగురు, కొసమాల, పెద్దలక్ష్మీపురం, చాపర, మెళియాపుట్టి, గొప్పిలి, బందపల్లి బాలికల గిరిజన ఆశ్రమ పాఠశాలల నుంచి ఒక్కొక్కరు, కోసమాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఏడుగురు ఎంపికైనట్లు తెలిపారు. విద్యాశాఖ అధికారులతో పాటు తహశీల్దార్ కె.జానకమ్మ, ఎంపిడిఒ జి.బాస్కరరావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులకు అభినందించారు.

కవిటి: మండలంలోని బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చదివి ఆరుగురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు ఎస్.రామకృష్ణ తెలిపారు. ఎన్ని అయింద్రీశా, ఎస్.సౌమ్యశ్రీ నూజివీడు, బార్ల లహరి, రుంకు శ్రీకర్, బిసాయ్ లక్షద్వీప్ ఒంగోలు, బల్లెడ శ్రీహిత శ్రీకాకుళం క్యాంపస్‌కు ఎంపికైనట్టు తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు విద్యార్థులను అభినందించారు.

నౌపడ : సంతబొమ్మాళి మండలం దండుగోపాలపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి నలుగురు విద్యార్థులు ట్రిబుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు కోత చైతన్య తెలిపారు. పాఠశాల విద్యార్థులు అప్పిని కీర్తన, అలజంగి షణ్ముఖ ప్రియ, కింజరాపు సాత్విక, వాడరేవు భూమికలు ఎంపికయ్యారని అన్నారు. నౌపడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల నుంచి ముగ్గురు విద్యార్థులు ట్రిబుల్ ఐటిలో సీట్లు సాధించారు. సాహకరి శ్వేత, యు.ప్రగతి, జి.భవ్యశ్రీ ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.భానుప్రకాష్ తెలిపారు. విద్యార్థులకు, తల్లిదండ్రులకు అభినందనలు తెలియజేశారు.

పోలాకి: మండలంలో ఈదులవలస ఎపి మోడల్ స్కూల్ నుంచి ఈ ఏడాది 8 మంది విద్యార్థులు ట్రిబల్ ఐటికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ తెలిపారు. తమ పాఠశాల నుంచి మెట్ట జీవిత, సూరాడ దీపిక, పైసాగి ఎమున, యారబాటి రేష్మ, పేడాడ కుసుమాంజిలి నూజివీడు ఎంపిక అయ్యారని అన్నారు. అలాగే కోరాడ మోనిష, కరణం శ్రావ్య శ్రీకాకుళం ఎంపికయ్యారని అన్నారు. అలిగి జోష్న ఒంగోలు ఎంపికయ్యారని తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

మందస : మండలంలోని హరిపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్‌లో ముగ్గురు విద్యార్థులు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని ప్రధానోపాధ్యాయులు గవర ఉమారాజు తెలిపారు. లబ్బ కోకిల ఒంగోలు, వారణాసి సౌమ్య శ్రీకాకుళం, గొరక అనురాధ నూజివీడులకు ఎంపికైనట్లు తెలిపారు. వీరికి ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు.

టెక్కలి : మండలంలోని నర్సింగపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల నుంచి వజ్జల ఖగేశ్వరి, దవళ ఝాన్సీ నూజివీడు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారని హెచ్ఎం ఎ.సోమేశ్వరరావు, బాలికోన్నత పాఠశాల నుంచి పల్లవి, తనుష్క శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రదానోపాధ్యాయురాలు నౌపడ శోభారాణి, సీతాపురం జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఎస్.విశాల్ నూజివీడు, ఇ.మధు శ్రీకాకుళం, డి.బాలభాస్కర్ ఒంగోలు ట్రిపుల్ ఐటిలకు ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు సత్తారు వేణీకుమారి చాకిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నుంచి విలియం కీర్తి శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు ఎం.అనురాధలు తెలిపారు.

కంచిలి : ట్రిబుల్ ఐటి ప్రవేశాలకు మండలానికి చెందిన 16 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. డి.జిపురం జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన జి.నిర్మల, రాజశ్రీనాయక్, కె.స్నేహ, కె.కృష్ణవేణి, స్నేహ నేపాక్, ఎం.ఎస్.పల్లి మోడల్ పాఠశాలకు చెందిన కె.సంధ్య, బి.జ్యోత్స్నవి, కె.ప్రీతి, పి.దీపక్, జలంత్రకోట జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన మురళిగౌడ్, బలరాం పాత్రో, స్నేహలత పాడి, ఎమ్మెస్ పల్లి పాఠశాలకు చెందిన అంజలి బెహరా, ముండల పాఠశాలకు చెందిన శ్రీనుపాత్రో, కంచిలి గురుకుల పాఠశాలకు చెందిన పి.లిఖిత్ సాయి ప్రసాద్, టి.నిరంజన్ ఎంపికయ్యారు. వీరికి ఎంఇఒ ఎస్.శివరాంప్రసాద్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు అభినందించారు.

సోంపేట : సోంపేట ప్రభుత్వ మోడల్ స్కూల్‌కి చెందిన 12 మంది విద్యార్థులు ట్రిబుల్ ఐటీ ప్రవేశాలు పొందినట్లు ప్రిన్సిపాల్ చిన్నజీవర్మ తెలిపారు. కళాశాలకు చెందిన బి.హాసిని, బి.హైమావతి, సహస్ర బెహరా, డి.హేమంత్, కె.మహేష్, కె.రియ, ఎం.అమృత, పి.గౌరి, ఆర్.ఇందుప్రియ, ఎస్.దివ్యశ్రీ, టి.కుసుమ, టి.లలిత్లులు ఎంపికయ్యారని అన్నారు. ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు అభినందనలు తెలిపారు.

నందిగాం : మండలంలోని పెద్దతామరపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి ఇప్పిలి మేఘన, బార్జన జోత్నలు, సూర మోహిత్, కవిటిఅగ్రహారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల నుంచి గుమ్మడి సోనియా, రోణగల ధరణి, ధూపానవాణి, పెద్దతామరాపల్లి నుంచి ఇద్దరు, తురకలకోట నుంచి ఒకరు ట్రిపుల్ ఐటికి ఎంపికయ్యారు.

లావేరు: మండలంలోని మురపాక కెజిబివి పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థినులు ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ బల్ల సుధారాణి తెలిపారు. జె. షణ్ముకప్రియ నూజివీడు, పి.పావని శ్రీకాకుళం, జి.చందన ఒంగోలు ట్రిపుల్ ఐటీలో సీట్లు సంపాదించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ బల్ల సుధారాణి, ఉపాధ్యాయులు అభినందించారు.



మెళియాపుట్టి : మాట్లాడుతున్న ఎంఇఒలు



జి.సిగడాం : విద్యార్థులతో ప్రిన్సిపాల్, సిబ్బంది

జి.సిగడాం: మండలానికి చెందిన ఎపి మోడల్ స్కూల్ నుంచి ఐదుగురు విద్యార్థులు, జిల్లా పరిషత్ హైస్కూల్ నుంచి ఒక విద్యార్థి ఎంపికైనట్లు మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ లంక అన్న శామ్యూల్, హైస్కూల్ ప్రిన్సిపాల్ నరసింహమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ స్కూల్‌కు నవర ప్రదీప్ కుమార్, హేమా దీపిక నూజివీడు, ధర్మాన గ్రీష్మ శ్రీకాకుళం, జాక మనోజ్ కుమార్, డొప్ప భవాని ఒంగోలులో సీట్లను కైవసం చేసుకున్నారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల చెందిన వన్నల యోగి శ్రీకాకుళంలో సీటు సంపాధించారు.

పొందూరు: మండలం లోలుగు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని బి.పవిత్ర శ్రీకాకుళం ట్రిపుల్ ఐటికి ఎంపికైనట్లు హెచ్ఎం సంజీవరావు తెలిపారు. విద్యార్థిని ట్రిపుల్ ఐటికి ఎంపికవ్వడంతో ఉపాధ్యాయులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

రణస్థలం: ట్రిపుల్ ఐటి ప్రవేశ పరీక్షలో స్థానిక ఆదర్శ పాఠశాల నుంచి 17మంది విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్ తెలిపారు. విద్యార్థుల ఎంపికపై ప్రిన్సిపాల్ శ్రీధర్ హర్షం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు.

వ్యవసాయ పనులకు 'ఉపాధి' అనుసంధానం చేయాలి

కవిటి: తీరప్రాంతాల్లో ఉండడం, వరుసగా ప్రకృతి విపత్తులకు గురవుతుండడంతో కవిటి మండలాన్ని ప్రత్యేక మండలంగా గుర్తించి వ్యవసాయ పనులకు ఉపాధి హామీ అనుసంధానం చేయాలని పలువురు నాయకులు, రైతులు కోరారు. స్థానిక వెలుగు కార్యాలయం ఆవరణలో కవిటి మండలం ఉపాధి హామీ 17వ ప్రజావేదిక గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్సీ రామారావు మాట్లాడుతూ ప్రకృతి విపత్తులతో కుదేలైన కవిటి మండలం రైతాంగానికి ఐదు లక్షల కొబ్బరి మొక్కలు ఉచితంగా అందించాలని కోరారు. దీనిపై ఇదివరకే కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశానని చెప్పారు. మరోసారి ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన మొక్కలు అందించేలా చర్యలు తీసుకోవాలని డ్వామా పీడీ చిట్టిరాజును కోరారు. అనంతరం మండలంలోని అన్ని పంచాయతీల్లో జరిగిన పనుల ప్రాప్తిని సిబ్బంది వివరించారు. మండల వ్యాప్తంగా 3,678 పనులకు గాను రూ.10,38,10,600 చెల్లించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా లండారిపుట్టుగ సర్పంచ్ మురపాల కుమారి మాట్లాడుతూ తమ పంచాయతీలో 711 జాబ్‌కార్డులు ఉన్నాయని, వీరికి రూ.1,77,75,000 కోట్ల పని చేయాల్సి ఉందని అన్నారు. కానీ, కనీసం రూ.50 లక్షల పనికూడా కల్పించలేదని ఆరోపించారు. దీంతో పనులు కల్పించడం లేదని తనకు ఫిర్యాదులు వస్తున్నాయని, భవిష్యత్‌లోనైనా పూర్తిస్థాయిలో పనులు చేపట్టాలని కోరారు. అనంతరం పీడీ చిట్టిరాజు కొన్ని పనుల్లో సిబ్బంది అలసత్వం, పనుల గుర్తింపులో లోపాలు చూసి సంబంధిత సిబ్బందికి రూ.26,700 అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో డివిఒ లవరాజు, ఎపిడిలు శ్రీనివాసరెడ్డి, మురళి, ఎంపిపి కడియాల పద్మ, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, వైసిపి మండల అధ్యక్షుడు కడియాల ప్రకాష్, జెడ్‌పిటిసి మాజీ సభ్యుడు బెందాళం రమేష్ పాల్గొన్నారు.



ప్రజావేదికలో మాట్లాడుతున్న పీడీ చిట్టిరాజు



బెల్లం ఊటలను ధ్వంసం చేస్తున్న పోలీసులు

నాటుసారా స్థావరాలపై దాడులు

మందస: సోంపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ ఆర్.జైభీమ్, సిబ్బందితో మండలంలోని కొండలోగాం పంచాయతీ బాతుపురంలో గురువారం నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు నిర్వహించారు. నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన 600 లీటర్ల బెల్లం ఊటలను ధ్వంసం చేశారు. అలాగే 15 లీటర్ల నాటుసారాను స్వాధీనం చేశారు. ఎవరైనా నాటుసారా తయారు చేస్తే వారిపై చర్యలు తీసుకుంటామని సిఐ రామచంద్రకుమార్ హెచ్చరించారు. కార్యక్రమంలో సిబ్బంది కాంతారావు, భీమారావు, నాయుడు పాల్గొన్నారు.



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న శేషగిరి

టిడిపి కార్యాలయం ప్రారంభం

టెక్కలి : మండలంలోని బూరగాంలో తెలుగుదేశం పార్టీ కార్యాలయాన్ని ఆ పార్టీ మండల అధ్యక్షులు బగాది శేషగిరి గురువారం ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు కింజరాపు రామ్మోహన్ నాయుడు, కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశాల మేరకు గ్రామీణ ప్రాంత ప్రజలకు పార్టీ కార్యక్రమాలు, సేవలు అందుబాటులో ఉండాలనే ఉద్దేశంతో కార్యాలయాన్ని ప్రారంభించామని తెలిపారు. సిఎం చంద్రబాబు నాయుడుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హనుమంతు రామకృష్ణ, మామిడి రాము, దల్లి ప్రసాద్‌రెడ్డి, గేదెల సంజీవరావు, జనపాన రూపావతి, జనపాన తేజ, గేదెల రమణయ్య పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

శ్రీకాకుళం : శుక్రవారం 11 కెవి విద్యుత్ లైన్ల నిర్వహణలో భాగంగా ఎఎస్ఎన్ఎం కాలనీ విద్యుత్ ఉపకేంద్రం పరిధిలోని వరం కాలనీ, హోమియో నగర్, విజయ నగర్, ఎఎస్ఎన్ఎం కాలనీ, ఎస్‌బిఐ స్టాఫ్ కాలనీ, పెద్దబొందిలిపురం తదితర ఏరియాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నామని విద్యుత్‌శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తిలక్ నగర్, ఇల్లిసిపురం, సానావీధి, కొన్న వీధి, రాధాకృష్ణ నగర్, తుమ్మా వీధి, బర్మా కాలనీ, రాయి వీధి, కత్తెర వీధి తదితర ఏరియాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

టెక్కలి రూరల్ : టెక్కలి సబ్‌స్టేషన్ పరిధిలో భగవాన్‌పురం, అక్కువరం, చింతలగారా, సాకిపల్లి, కె.కొత్తూరు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. 11 కెవి మరమ్మతులు చేపడుతున్న నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటలకు వరకు విద్యుత్‌ను నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

కవిటి: మండలంలోని 11 కె.వి.రాజాపురం విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తులు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఇఇ జి.ప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు. 11కెవి లైన్ మైంటెనెన్స్ పనులు, చెట్లు కొమ్మలు తొలగించనున్న నేపథ్యంలో కవిటి, కవిటికొత్తూరు, ప్రగడపుట్టుగ, గొండ్యాలపుట్టుగ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నామని అన్నారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

సోంపేట : మండలంలోని కొర్లాం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పలు గ్రామాలకు శుక్రవారం ఉదయం 8.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు వరకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు పలాస ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.ప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ఉద్దానం ఫీడర్ పరిధిలోని బారువ, గొల్లగండి, సిహెచ్.గొల్లగండి, రామయ్య పట్టణం, ఉదానం వాటర్ వర్క్స్ గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు సిబ్బందికి సహకరించాలని కోరారు.

హెల్మెట్ రక్షణ కవచం

ప్రజాశక్తి- పొందూరు

ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ రక్షణ కవచం వంటిందని జూనియర్ సివిల్ జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. పట్టణంలోని అంబేద్కర్ కూడలిలో గురువారం ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రహదారి ప్రమాదాల సమయంలో ద్విచక్ర వాహనదారులను హెల్మెట్ ప్రాణాప్రాయస్థితి నుంచి రక్షిస్తుందన్నారు. హెల్మెట్ ధరించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో కోర్టు సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి జ్యోత్స్న

కోటబొమ్మాళి: ద్విచక్రవాహనం నడిపిన వారు, వెనుక కూర్చొన్న వారు హెల్మెట్ ధరించి ప్రాణాలను కాపాడుకోండని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవా సంఘం అధ్యక్షులు బి.ఎం.ఆర్.ప్రసన్నలత అన్నారు. మండల న్యాయ సేవా సంఘం ఆధ్వర్యాన హెల్మెట్ వాడకపోవడం వల్ల జరిగే చెడు ప్రభావాలపై న్యాయవాదులు గురువారం ర్యాలీని నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అమె మాట్లాడుతూ శిరస్త్రాణం స్వీయ రక్షణకు, కుటుంబ శ్రేయస్సుకు ముఖ్యసాధనమని అన్నారు. మీ స్నేహితులకు సన్నిహితులకు, వారి ప్రాణ రక్షణకు హెల్మెంట్లను బహూకరించాలని అన్నారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘం అధ్యక్షులు లకినేని శ్రీనివాసులు,ఉపాధ్యక్షులు నారాయణరావు, కార్యదర్శి తిరుమలరావు, న్యాయవాదులు పూజారి వాసుదేవరావు, డి.నరసింహమూర్తి, వెలమల అప్పలనాయుడు, బి.ధర్మారావు, కె.మన్మథరావు, వై.వెంకటరావు, సిహెచ్.వెంకటరావు, కె.వెంకటరావు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : అవగాహనా ర్యాలీ నిర్వహిస్తున్న న్యాయవాదులు

మోటారు వాహన చట్టాలపై అవగాహన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

విద్యార్థులు మోటారు వాహనచట్టాలపై పూర్తి అవగహన కలిగి ఉండాలని జిల్లా న్యాయసేవాదికార సంస్థ ఇన్‌ఛార్జి కార్యదర్శి యుగంధర్ అన్నారు. గురువారం నగరంలోని కాకినాడ ఆదిత్య డిగ్రీ కళాశాలలో మోటార్ వాహనాల చట్టంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. మోటర్ వాహనాన్ని నడిపే వ్యక్తికి తప్పనిసరిగా లైసెన్స్, ఆర్‌సి, ఇన్సూరెన్స్, హెల్మెట్ కలిగి ఉండాలన్నారు. హెల్మెట్ ధరించడం వలన రోడ్డు ప్రమాదాలు సంభవించినప్పుడు తలకు గాయం కాకుండా ప్రాణాలతో బయట పడేందుకు దోహద పడుతుందన్నారు. రోడ్డుపై వాహనంతో వెళ్తున్న వారు తన కోసం ఇంటి వద్ద ఓ కుటుంబం ఉందన్న స్పృహతో ఉండాలని, అప్పుడే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ఉండేందుకు వీలుందన్నారు. కార్యక్రమంలో స్పెషల్ మొబైల్ కోర్టు జడ్జి సిహెచ్ శ్రీవిద్య, జూనియర్ సివిల్ జడ్జి, మానీమ్ రోషిని, కళాశాల ప్రిన్సిపాల్ ఎన్.వి.వేణుగోపాల్, అడ్వకేట్, ఇందిరా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యుగంధర్

కెజిబివి తనిఖీ

ఇచ్ఛాపురం : పట్టణంలోని కెజిబివిని ఎంఇఒ కురమాన అప్పారావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన సమయంలో పరిశీలించి విద్యార్థినులతో ముచ్చటించారు. మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం నిర్వహించాలని వంట కార్మికులకు సూచించారు. విద్యార్థుల్లో బోధనా నైపుణ్యాలు బలోపేతం చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఎప్పటికప్పుడు పాఠ్యాంశాలు, సందేహాలు నివృత్తి చేయాలన్నారు. ఈ ఏడాది పదో తరగతిలో విద్యార్థులు శతశాతం ఉత్తీర్ణత దిశగా పాఠాలు బోధించాలన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఎంఇఒ అప్పారావు

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలి

ప్రజాశక్తి- టెక్కలి

ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాలని ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర సహాధ్యక్షులు ఎన్.లక్ష్మణరావు డిమాండ్ చేశారు. టెక్కలి ప్రాథమిక పాఠశాలలో గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలల్లో ఒకటి నుంచి ఐదు వరకు తరగతులు నిర్వహించాలన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిర్వీర్యమైన ప్రాథమిక విద్యారంగాన్ని బలోపేతం చేసేందుకు అటంకంగా ఉన్న జిఒను తక్షణమే రద్దు చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకే తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలన్నారు. సంపూర్ణ పోషక పథకం అమలులో భాగంగా లోపాలను సరిదిద్దాలని కోరారు. పాఠశాల నిర్వహణ నిధులు గత బకాయిలను మంజూరు చేయాలన్నారు. విద్యుత్ ఛార్జీలను ప్రభుత్వమే భరించాలని కోరారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి చిలుకు కృష్ణారావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వై.హరిబాబు, జిల్లా సభ్యులు కె.సీతరాజు, కె.హేమలత, సిహెచ్.రమాదేవి, గోవిందరావు, వెంకటరమణ, మధుబాబు, విశ్వనాథం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న లక్ష్మణరావు

రాజీవ్ గృహకల్పలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఇళ్లులేని నిరుపేదలకు గూడు కల్పించాలన్న సదుద్దేశ్యంతో ప్రభుత్వం కలెక్టరేట్ సమీపంలో రాజీవ్ గృహకల్ప సముదయాన్ని నిర్మించి లబ్దిదారులకు అందజేసింది. ఈ కాలనీలో క్రమం తప్పకుండా పారిశుధ్య పనులు పూర్తిస్థాయిలో చేపట్టకపోవడంతో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. దీంతో కాలువల్లో ఎక్కడికక్కడ మురుగునీరు నిలిచి వర్షం వస్తే మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. డ్రైనేజీలతో పాటు లోతట్టు ప్రాంతాల్లోను మురుగు పేరుకు పోవడంతో కాలనీవాసులు దుర్భర పరిస్థితులు అనుభవిస్తున్నారు.

దీనికి తోడు కాలనీకి ఆనుకుని నగర వ్యర్థాలతో మురుగునీరు ప్రవహించే కాల్వ ఇక్కడే ఉండడంతో కాలనీ వాసులు దుర్గంధంతో ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలకు ముందు ఈ కాలనీ వాసుల కష్టాలను తెలుసుకున్న గొండు శంకర్ ఎమ్మెల్యేగా బాధ్యతలు చేపట్టిన తరువాత మున్సిపల్ అధికారులతో చర్చించి యుద్ధ ప్రతిపదికన పారిశుధ్య పనులు చేపట్టేందుకు ఒత్తిడి పెంచారు. గురువారం కాలనీలో పెద్దఎత్తున పారిశుధ్య నిర్వహణ పనులను చేపట్టారు. కాలువల్లో పేరుకుపోయిన చెత్తను తొలగించి మురుగునీరు ప్రవహించే చర్యలు చేపట్టారు. టిడిపి నాయకులు గుత్తు చిన్నారావు, రెడ్డి గౌరీ శంకర్‌ల పర్యవేక్షణలో పనులు చేపట్టారు.

లారీని ఢీకొని యువకుడు మృతి

అయ్యవారిపేటలో విషాదఛాయలు

అమ్మ డ్యూటీకి వెళ్లి వస్తా అని చెప్పి వెళ్లిన కొడుకు కొద్ది నిమిషాల్లోనే అనంత లోకాలకు వెళ్లిపోయాడనే వార్త ఆ కుటుంబంపై పిడుగులా పడింది. చేతికి అంది వచ్చిన కొడుకు అకాల మృత్యువాత పడటం ఆ కుటుంబాన్ని కలిచివేసింది. భవిష్యత్‌పై ఎన్నో ఆశలతో ఉన్న ఆ యువకునికి ఆగి ఉన్న లారీయే యమపాశమైంది.

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని అయ్యవారిపేటకు చెందిన చోడవరపు లక్ష్మణుడు, సూర్యం దంపతులకు ఏకైక పుత్రుడు చోడవరపు భార్గవ్ కుమార్. తల్లిదండ్రులు ఎంతో అల్లారు ముద్దుగా పెంచి పెద్ద చేశారు. తల్లిదండ్రుల ఆశలు వమ్ము చేయకుండా ప్రయోజకుడైన కొడుకు భార్గవ్ పైడి భీమవరంలోని రెడ్డీస్ కంపెనీలో అప్రెంటిస్ ఇంజనీర్‌గా జాయిన్ అయ్యాడు. మరికొద్ది నెలల్లో పర్మినెంట్ అవుతుంది. తన కుటుంబాన్ని, అమ్మానాన్నలను ఇంకా బాగా చూసుకోవచ్చు అన్న ఆశతో భార్గవ్ ప్రతిరోజు తన సొంత గ్రామమైన అయ్యవారిపేట నుంచి శ్రీకాకుళంకు ద్విచక్ర వాహనంపై వెళ్లి వస్తుండేవాడు. అదే విధంగా గురువారం ఉదయం 5 గంటలకు తన ఇంటి నుంచి బయలుదేరుతూ తల్లిదండ్రులకు వెళ్లి వస్తా అని చెప్పాడు. మండలంలోని సింగన్నపాలెం గ్రామం వద్ద మరమతులకు గురైన భారీ లారీ రోడ్డు పక్కన ఆగి ఉండగా లారీని బలంగా ఢీకొట్టాడు. దీంతో అక్కడికక్కడే మృతి చెందాడు.



రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన భార్గవ్

అంది వచ్చిన కొడుకు అనంత లోకాలకు

డ్యూటీకి వెళ్ళిన కొడుకు సాయంత్రం ఇంటికి వస్తాడని ఉన్న తల్లిదండ్రులకు ఇంటి నుంచి బయలుదేరిన కొద్ది నిమిషాలకే కుమారుని మరణం వార్త వాళ్ళని దహించవేసింది. కొడుకు ఇక లేడు, తిరిగి రాడు అని తెలుసుకుని తండ్రులు బోరిన విలపించారు. ఉన్న ఒక్కగానొక్క కొడుకు తమకు దక్కకుండా పోయాడని బోరున విలపించారు. తల్లిదండ్రుల రోధనలు గ్రామస్తులను కలిచి వేసింది.

శోకసంద్రమైన గ్రామం

క్రమశిక్షణతో మెలిగి ప్రయోజకుడై ఉద్యోగాన్ని సంపాదించుకున్న భార్గవ్ మరణం వార్త ఆ గ్రామాన్ని శోకసంద్రంలో ముంచింది. భార్గవ్ చిన్నప్పటినుంచే క్రమశిక్షణతో విద్యపై ఆసక్తితో అనుకున్న లక్ష్యాన్ని సాధించాడని, ఇలా రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో ప్రతిఒక్కరు కన్నీరు మున్నేరుగా విలపిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. భార్గవ్ మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు.

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, SRIKAKULAM
S.O.P. 8/2024

Between:
1. Kanchi Srinivasarao @ Dunna Srinivasarao, S/o Late Kanchi Satyam R/o Maruthinagar- 5, narasannapeta town, Post & mandel, srikakulam District PIN 532421.
2. Irri Padma W/o Asirinaidu, D/o late Dunna Suryanarayana, R/o Maruthinagar-5, narasannapeta town, post, mandal Srikakulam District Pin 532421, at present R/o Yallapeta village, Ravipadu post, Jalumuru mandal, Srikakulam district 532474 **...Petitioners**
And: **Nil** **...Respondents**

పై నెంబర్ పిటీషన్‌లో పిటిషనర్స్ తల్లి గారైన దున్న లక్ష్మి (కంచి లక్ష్మి) తే 14-01-2021 దిన కాలము చేసినందున పిటిషనర్స్ మాత్రమే ముఖ్య వారసులై జీవించి ఉన్నారు. లేటు దున్న లక్ష్మి జీవించి ఉన్న కాలములో ఆంధ్రా బ్యాంక్ ప్రస్తుతము UBI నరసన్నపేట బ్రాంచ్ నందు డబ్బులు ఫిక్స్‌డ్ డిపాజిట్లు మూలంగా దాచి ఉన్నారు. ప్రస్తుత పిటిషనర్స్ తల్లి గారైన దున్న లక్ష్మి మరణానంతరము ఆమె యొక్క డిపాజిట్లుకు ముఖ్య వారసులై ఉన్నందున పిటిషన్ షెడ్యూల్‌లో తెలిపిన సదరు డిపాజిట్లు వడ్డీతో సహా సొమ్ము బ్యాంక్ నుండి పొందు నిమిత్తం హక్కు కలిగి ఉన్నందున పిటిషనర్స్ పరమున SUCCESSION CERTIFICATE జారీ చేయమని కోరుచు పై కోర్టు నందు S.O.P.8/2024 పిటిషను దాఖలు చేసి ఉన్నారు. సదరు పిటిషను జనరల్ నోటీస్ నిమిత్తమై తే 15-07-2024 దికి వాయిదా అయి ఉన్నది. కావున పై నెంబరు పిటిషన్ పై ఎవరికైనను ఎట్టి ఆక్షేపనులు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **తే 15-07-2024దిన ఉ॥ 10-30 గంటలకు** స్వయముగా గాని, వకీలు ద్వారాగాని హాజరై తెలియపరచుకోవలెను. లేని యెడల పిటిషనర్స్ పరమున SUCCESSION CERTIFICATE శ్రీ కోర్టు వారు జారీ చేయుదురని ఇందు మూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

తేది:12.7.2024, నరసన్నపేట
ఇప్పిలి చారుమతి
పిటిషనర్స్ తరుపు న్యాయవాదులు.



కందిపప్పు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న రవికుమార్

ప్రజలకు అందుబాటులో నిత్యావసర సరుకులు

ప్రజాశక్తి - ఆమదాలవలస

నిత్యావసర సరుకులు ప్రజలకు అందుబాటులో ఉంచడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని రైతుబజార్ వద్ద పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కందిపప్పు కౌంటర్‌ను రవికుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలందరికీ సిఎం చంద్రబాబు నాయుడు నిత్యావసర సరుకుల ధరలను అందుబాటులో ఉంచడానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా మార్కెట్ ధర కంటే ప్రజలకు కందిపప్పు తక్కువ రేటుకు విక్రయించడానికి ఈ షాపులు ఎంతో ఉపయోగ పడతాయన్నారు. బహిరంగ మార్కెట్‌లో అధిక ధర ఉన్న కందిపప్పును రైతు బజారులో కిలో రూ.160కే విక్రయించడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలందరూ వినియోగించు కోవాలని కోరారు. కార్యక్రమంలో డిఎస్‌ఒ శాంతి, తహశీల్దార్ కె.వేణు గోపాలరావు, పౌర సరఫరాల శాఖ డిటి దువ్వాడ అమర్నాథ్, టిడిపి నాయకులు తమ్మినేని చంద్రశేఖర్, నూకరాజు, బొడ్డేపల్లి గోరీపతి, అన్నెపు భాస్కరరావు పాల్గొన్నారు.



మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న డిఇఒ వెంకటేశ్వరరావు

ఆదర్శ పాఠశాల ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి - రణస్థలం

మండలంలోని కొండములగాం ప్రభుత్వ ఆదర్శ పాఠశాలను జిల్లా విద్యాశాఖాధికారి కె.వెంకటేశ్వరరావు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. బాలికల వసతిగృహంలో ప్రతి గది, వంట గది, మెనూను పరిశీలించారు. వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్తగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. పాఠశాలలో మధ్యాహ్న భోజనం రుచి చూసిన అనంతరం పదో తరగతి విద్యార్థులతో మాట్లాడారు. మంచి ఫలితాలు సాధించాలన్నారు. కార్యక్రమంలో ఎంఇఒలు ఎ.త్రినాథరావు, బి.లావణ్య, పాఠశాల ప్రిన్సిపాల్ పొట్నూరు శ్రీధర్, ఉపాధ్యాయులు, ఆఫీసు సిబ్బంది ఉన్నారు.



రవికుమార్‌ను సన్మానిస్తున్న పెన్షనర్లు

రవికుమార్‌కు పెన్షనర్ల సత్కారం

ప్రజాశక్తి - ఆమదాలవలస

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఎమ్మెల్యే కూన రవికుమార్‌ను పెన్షనర్ల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు సురవరపు సిమ్మనాయుడు, బొడ్డేపల్లి జనార్దనరావు ఆధ్వర్యంలో పెన్షనర్ల సంఘం నాయకులు, సభ్యులు ఘనంగా సన్మానించారు. ముందుగా పూలమాలతో సత్కరించి శాలువతో సన్మానించి మెమొంటోను అందజేశారు. ఈ సందర్భంగా పెన్షనర్ల సంఘం నాయకులు మాట్లాడుతూ నియోజకవర్గ అభివృద్ధికి, పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని రవికుమార్‌ను కోరారు. పెన్షనర్ల సంఘ భవన నిర్మాణానికి స్థలం కేటాయించాలని పెన్షనర్లు కోరగా వినతిపత్రం అందించాలని రవికుమార్ వారికి సూచించారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం గౌరవ అధ్యక్షులు బొడ్డేపల్లి మోహనరావు, కోశాధికారి హెచ్.వి.సత్యనారాయణ, ఉపాధ్యక్షులు ధాస్యం లక్ష్మణరావు, కె.షణ్ముఖరావు, ఎన్. చంద్రశేఖరరావు, బి.వి.రమణ, పేడాడ భానోజీరావు, కె.సంజీవరావు పాల్గొన్నారు.

నిరంతర పోరాటాలతో విజయాలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఉద్యోగుల సమస్యల పోరాటానికి ప్రతినిత్యం పోరాడుతూ ఎన్నో విజయాలను సొంత చేసుకున్న చరిత్ర ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్‌కు ఉందని యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పి.నానాజీరావు అన్నారు. గురువారం యూనియన్ కార్యాలయంలో 73వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈవేడుకల్లో ఆయన కేకు కట్ చేసి ఉద్యోగులకు పంచిపెట్టారు. భవిష్యత్‌లో అమరావతి జెఎసితో కలుపుకొని మరిన్ని విజయాలు సాధిస్తామన్నారు. ఎంప్లాయిస్ యూనియన్ సీనియర్ నాయకులు ఎస్ అప్పారావు, ఎస్ఎస్ఆర్ శర్మ, కొర్లాం గణేశ్వరరావులు యూనియన్ మరింత బలోపేతం కావాలని పిలుపునిచ్చారు. ఆర్‌టిసి ప్రభుత్వంలో విలీనమైన తర్వాత ఉత్పన్నమవుతున్న సమస్యలపై పోరాటాలు చేస్తామన్నారు. జిల్లాఅధ్యక్ష, కార్యదర్శులు జి.త్రినాథ్, కె.దశరథ, జెఎసి కార్యదర్శి ఎస్.వి. రమణ, డిపో నాయకులు బిఆర్ కృష్ణ, కె.బాబురావు, కెజి రావుపాల్గొన్నారు.



మహిళలకు అవగాహన కల్పిస్తున్న ఎపిఎం

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

ఆమదాలవలస: గ్రామీణ ప్రాంతాల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు స్టాప్ డయేరియా, డెంగీ, మలేరియా కార్యక్రమాన్ని చేపట్టినట్లు వెలుగు ఎపిఎం పైడి కూర్మారావు వివరించారు. గురువారం మండలంలోని బొప్పిలిపేట పంచాయతీ కార్యాలయం, పాఠశాల, అంగన్వాడీ కేంద్రం తదితర ప్రదేశాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలను పరిశీలించారు. మురుగు కాలువలు, చెత్తకుప్పల నిర్మూలనపై మహిళలకు అవగాహన కల్పించారు. నీటి నిల్వలు ఉన్న ప్రదేశాల్లో ఈగలు, దోమలు వృద్ధి చెందకుండా శానిటేషన్ కార్యక్రమాలు చేపట్టాలని కార్యదర్శి ప్రేమ్‌కుమార్‌కు సూచించారు. పాఠశాల పరిధిలో హెచ్ఎం మెట్ట జబ్బు ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమాలు చేపట్టారు. కార్యక్రమంలో క్లస్టర్ కో-ఆర్డినేటర్లు రమణ, సుభద్రతో పాటు విఒఎ శ్యామల, అంగన్వాడీ కార్యకర్త గురుగుబెల్లి సన్యాసమ్మ, గ్రామ సంఘం ప్రతినిధులు పైడి వనజాక్షి, రోహిణి, కూన కళ్యాణి, ఆశావర్కర్లు, స్వయంశక్తి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో భార్యపై దాడి

టెక్కలి: టెక్కలి మున్సిఫ్ మెజిస్ట్రేట్ కోర్టు ఆవరణలో గురువారం భార్యపై భర్త దాడి చేసిన ఘటన విస్మయాన్ని కలిగించింది. మండలంలోని అయోధ్యాపురం పంచాయతీ కంట్రగడకు చెందిన ఆరంగి శోభారాణి నరసన్నపేట మండలం సత్యవరానికి చెందిన చలపతిరావులు భార్యాభర్తల మధ్య తలెత్తిన వివాదంపై కోర్టులో కేసు నడుస్తుంది. ఈ క్రమంలో ఇరువురు వాయిదా నిమిత్తం గురువారం కోర్టుకు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో ఇరువురు మధ్య తలెత్తిన వివాదం తారాస్థాయికి చేరుకుంది. చలపతిరావు కోపోద్రిక్తుడై భార్యపై దాడి చేశారు. దీంతో ఆమె టెక్కలి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఆయనపై కేసు నమోదు చేశారు.

అధిక జనాభాకు అడ్డుకట్ట వేయాలి



శ్రీకాకుళం అర్బన్ : ర్యాలీలో పాల్గొన్న జగన్మోహనరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జనాభా నియంత్రణకు దోహదపడుతున్న కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సపై రెడ్‌క్రాస్ ఆధ్వర్యాన నగరంలోని కుట్టు శిక్షణ కేంద్రంలో మహిళలకు అవగహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సంస్థ చైర్మన్ జగన్మోహనరావు మాట్లాడుతూ పెరుగుతున్న జనాభాతో దేశ ఆర్థిక వ్యవస్థపై పెనుభారం పడుతుందన్నారు. మహిళలు జనాభా నియంత్రణపై పూర్తి అవగహన పెంచుకోవాలన్నారు. ముందుగా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విశ్రాంత సిహెచ్ఒ చిన్మయరావు, పెంకి చైతన్య కుమార్, గోలివి రమణ, సుజాత, శిక్షకురాలు సంతోషి తదితరులు పాల్గొన్నారు.

మెడికవర్ ఆస్పత్రి ఆధ్వర్యాన

నగరంలోని మెడికవర్ ఆస్పత్రిలో ప్రపంచ జనాభా దినోత్సవంపై విజయ ఇనిస్టిట్యూట్ ఆఫ్ నర్సింగ్ సైన్సెస్ విద్యార్థులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డాక్టర్ దానేటి శ్రీధర్ హాజరై మాట్లాడుతూ జనాభా పెరుగుదలకు ప్రజల్లో అవగాహన లోపమేనన్నారు. కార్యక్రమంలో విజయ నర్సింగ్ కాలేజి వైస్ ప్రిన్సిపాల్ పార్వతి, నర్సింగ్ మూడో సంవత్సరం విద్యార్థినులు పాల్గొన్నారు.

ఆర్ట్స్ కాలేజీలో

ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యాన కళాశాల ప్రిన్సిపాల్ కె.సూర్య చంద్రరావు అధ్యక్షతన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ సత్యనారాయణ, ఆర్.హరిత, అర్థశాస్త్ర విభాగధిపతి సిహెచ్ రామమూర్తి, ఎన్ఎస్ఎస్ పిఒ శ్రీనివాస్ పాత్రో, తెలుగు విభాగధిపతి నారాయణరావు, పోలినాయుడు, ప్రమీల పాల్గొన్నారు.

పొందూరు: అధిక జనాభా వలన కలిగే దుష్ఫలితాలు, జనాభా నియంత్రణ చర్యలు వంటి వాటిపై విద్యార్థి దశనుంచే అవగాహన కలిగి ఉండాలని హెచ్‌ఎం బల్ల కంటయ్య అన్నారు. తాడివలస జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రపంచ జనాభా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక జనాభా వలన కలిగే అనార్థాలను తెలియజేస్తూ ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో పిహెచ్‌సి సిబ్బంది, ఉపాధ్యాయులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



పోలాకి : ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు, విద్యార్థులు

పోలాకి : అపరిమితంగా పెరిగిపోతున్న జనాభాని అదుపు చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పోలాకి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం విస్తరణాధికారి డాక్టర్ నల్లి రవికుమార్ అన్నారు. ప్రపంచ ఆరోగ్య దినోత్సవాన్ని పురస్కరించుకుని పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మంగం శేఖర్‌బాబు, బరాటం లక్ష్మి, ఎఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

గంజాయి రవాణాను అరికట్టాలి

ప్రజాశక్తి- పలాస

ఒడిశా సరిహద్దుకు సమీపంలో ఉన్న పలాస రోడ్డు, రైలు సౌకర్యం ఉండడంతో గంజాయి రవాణా జోరుగా సాగుతుందని, దీనిని అరికట్టాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉందని ఎఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదరి మొజ్జాడ యుగంధర్ అన్నారు. కాశీబుగ్గ గాంధీ విగ్రహం వద్ద గురువారం అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర సమితి పిలుపులో భాగంగా గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పలాస కేంద్రంగా జరుగుతున్న గంజాయి వ్యాపారాన్ని అరికట్టడంలో ప్రభుత్వ ఉన్నతాధికారులు, పోలీసు యంత్రాంగం విఫలమైందని ఆరోపించారు. పలాస రైల్వే స్టేషన్ ద్వారా అనేక ప్రాంతాల నుంచి గంజాయి రవాణా అవుతుందని అన్నారు. పాఠశాలలు, కాలేజీల కేంద్రంగా విద్యార్థులు, యువతకు తినుబండారాల రూపంలో మత్తు మందును కలిపి మత్తుపదార్థాలకు యువతను బానిసగా చేస్తున్నారని అన్నారు. తక్షణమే మత్తు పదార్థాలను అడ్డుకట్టాలని డిమాండ్ చేశారు. అలాగే గుట్కా, ఖైనీ, పాన్‌పరాగ్‌లను విక్రయిస్తున్నారని వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు వాసు, కొన్న శ్రీనివాసరావు, గుణశేఖర్, దిలీప్, వెంకటరావు, వల్లభరావు, సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న నాయకులు



సైబర్ మోసాలపై అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

సైబర్ నేరాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

సైబర్ నేరాలపై ప్రతిఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) ప్రజలకు సూచించారు. గురువారం పట్టణంలోని మెట్టక్కివలసలో యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతిఒక్కరు పొదుపు ప్రాముఖ్యతను తెలుసుకొని పొదుపు చేయాలన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని ఎవరైనా ఫోన్ చేసి ఎటిఎం పిన్‌కార్డు, బ్యాంకు అకౌంటు వివరాలను అడిగితే అటువంటి వారికి వివరాలు చెప్పవద్దని సూచించారు. బ్యాంకు అధికారులు ఎవరు ఫోన్లు చేసి వివరాలు అడగరన్నారు. ఎటిఎం కార్డు వలన ప్రజలకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అలాగే నగదు రహిత లావాదేవీలను కొనసాగించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి జీవన్ జ్యోతి యోజన పథకాన్ని 18 నుంచి 50 ఏళ్ల లోపు వారికి వర్తిస్తుందని, ఏడాదికి రూ.436 ప్రీమియం చెల్లించాలన్నారు. ఎవరైనా సైబర్ మోసాలకు గురైతే 1930 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఇంటిగ్రేటెడ్ అంబుడ్సెమెన్ టోల్ ఫ్రీ నెంబర్ 14448 నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిఒ మెట్ట అమ్మి నాయుడు, ఆర్‌పి శోభారాణి, జయలక్ష్మి, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

రామానంద భారతి అరసవల్లిని సందర్శన

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని గురువారం విశాఖపట్నంలోని మౌనానంద తపోవనం పీఠాధిపతి రామానంద భారతి సందర్శించారు. ఆయనకు ఆలయ మర్యాదలతో అర్చకులు స్వాగతించారు. ఆలయంలో స్వామి వారి సేవల్లో పాల్గొన్న అనంతరం అనివేటి మండపంలో ఆయన బాష్యం చదివి వినిపించారు.




లబ్ధిదారులతో మాట్లాడుతున్న లక్ష్మీరెడ్డి

ఇకెవైసికి పాట్లు

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

పట్టణంలోని ఇండియన్ గ్యాస్ ఏజెన్సీలో లబ్ధిదారులు ఇకెవైసికి పాట్లు పడుతున్నారు. ఒకేసారి వందలా మంది గ్యాస్ సబ్ ఆఫీసు వద్ద ఉదయం నుంచి పడి గాపులు పడుతున్నారు. స్థానిక శ్రీనివాస సిద్ధ భైరవి గ్యాస్ ఏజెన్సీ వద్ద ఇకెవైసికి కోసం మహిళలు పనులు మానుకొని ఎండలో క్యూ లైన్లు కడుతూ ఇబ్బందికరమైన వాతావరణంలో తిప్పలు పడుతున్నారు. గ్యాస్ ఇన్స్యూరెన్స్ కోసం రూ.250, సురక్ష టు కోసం రూ.190 వసూలు చేస్తూ.... ట్యూబ్ తీసుకున్న వారికే ఇకెవైసిలు గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది పెత్తనం చెలాయిస్తున్నారు. విషయం తెలుసుకున్న మహిళా మోర్చ అధ్యక్షులు మంగి లక్ష్మీరెడ్డి పరిశీలించి ఏజెన్సీ సిబ్బందిని ప్రశ్నించారు. ఇంటింటికి వెళ్లి ఇకెవైసి చేయించాలని సూచించారు.



మెటీరియల్‌ను అందజేస్తున్న మల్లికార్జునరావు

డ్రైవింగ్ స్కూల్‌లో మెటీరియల్ పంపిణీ

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

ఆర్‌టిసి ఆధ్వర్యాన శ్రీకాకుళంలో నిర్వహిస్తున్న హెవీ డ్రైవింగ్ స్కూల్‌లో 16వ బ్యాచ్ ట్రైనింగ్ తీసుకుంటున్న డ్రైవర్లకు ప్రిన్సిపాల్, శ్రీకాకుళం ఒకటో డిపో మేనేజర్ మల్లికార్జునరావు, రెండో డిపో మేనేజరు శర్మ చేతుల మీదుగా శిక్షణకు అవసరమైన మెటీరియల్‌ను గురువారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డ్రైవింగ్ స్కూల్ స్థాపించిన తర్వాత ఇప్పటివరకు 15 బ్యాచ్‌లకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. నిష్ణాతులైన డ్రైవర్లు శిక్షణ పొందడానికి స్కూల్‌లో సౌకర్యాలు ఉన్నాయన్నారు. శ్రద్ధతో నేర్చుకుని మంచి డ్రైవర్లుగా తయారు కావాలన్నారు. డ్రైవింగ్ స్కూల్‌లో మంచి నైపుణ్యం, బస్సు మొత్తం విడిభాగాలపై పూర్తి అవగాహన, రోడ్డు, ట్రాఫిక్, మోటార్ వెహికల్ నిబంధనలపై పూర్తి శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో లైట్ మోటార్ వెహికల్ లైసెన్స్ కలిగిన ప్రతిఒక్కరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ రమేష్, డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్ వర్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విఠల్‌రావు

కార్యకర్తలకు అండగా ఉంటాం

ప్రజాశక్తి- పలాస

ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో గ్రామస్థాయిలో టిడిపి గెలుపునకు కృషి చేసిన కార్యకర్తలకు సముచిత స్థానం కల్పించి అండగా ఉంటుందని టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు అన్నారు. స్థానిక టిడిపి కార్యాలయంలో గురువారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఇప్పటికే గ్రామస్థాయిలో కృషి చేసిన నాయకులకు పదవులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారని అన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక లేక భవన కార్మికులకు ఉపాధి లేకుండా పోయిందని, సామాన్యులు ఇళ్ల నిర్మాణాలు చేపట్టేందుకు ఎన్నో ఇబ్బందులు పడ్డారని అన్నారు. అటువంటి పరిస్థితి టిడిపి ప్రభుత్వం రాకూడదనే ఉద్దేశంతో ఉచితంగా ఇసుక పంపిణీ చేస్తున్నామని తెలిపారు. కేవలం రవాణా ఛార్జీలు చెల్లిస్తే ఇంటికే ఇసుక అందుబాటులో ఉంటుందన్నారు. వంశధార శివారం భూములకు సాగునీరు అందించేందుకు కృషి కేంద్ర, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యే గౌతు శిరీషకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండ్ల అధ్యక్షులు అధ్యక్షుడు కుత్తుం లక్ష్మణ్‌కుమార్, దువ్వాడ సంతోష్‌కుమార్, తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, వంకల కూర్మారావు, కుమార్ రాజు తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు అవగాహన

ప్రజాశక్తి- మెళియాపుట్టి

కౌలు కార్డులు పొందిన కౌలు రైతులకు ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందుతాయని మండల ఎఒ దానకర్ణుడు అన్నారు. మండలంలోని శిరయకండి, పెద్దపద్మాపురం గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో గురువారం కౌలు రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కౌలుదారు కార్డు తీసుకున్న రైతులు పంట నమోదు, పంటల బీమా, విత్తనాలు, ఎరువులు తీసుకోవడానికి, ధాన్యం మద్దతు ధరకు విక్రయించుకోవడానికి, ప్రకృతి వైపరీత్యాల వల్ల కలిగే పంట నష్టపరిహారం, రుణ సదుపాయం పొందవచ్చునని అన్నారు. కౌలుదారు కార్డు 11 నెలలు కాల పరిమితి ఉంటుందన్నారు. రైతు సేవా కేంద్రాల్లో విఆర్‌ఒల, విఎఎలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎఒ దానకర్ణుడు

కార్యక్రమంలో సర్పంచ్‌లు మాలతి శ్రీధర్, తాడేల రామరాజు, ధర్మారావు, భాస్కరరావు, ఎంపిటిసి ప్రతినిధి ఉర్లన రుషి, టిడిపి నాయకులు ఉర్లాన వసంతరావు, విఆర్‌ఒలు అన్నాజీరావు, లలిత, విఎఎలు పుష్ప, ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు దోహదం



పొందూరు : మొక్క నాటుతున్న ప్రిన్సిపాల్ సునీత



శ్రీకాకుళం అర్బన్ : మొక్కలు నాటుతున్న లైన్స్‌క్లబ్ సభ్యులు

ప్రజాశక్తి- పొందూరు

పర్యావరణ పరిరక్షణకు మొక్కలు ఎంతగానో దోహద పడతాయని కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ జె.సునీత అన్నారు. మండలం కింతలి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా కళాశాల ఆవరణలో వివిధ రకాల మొక్కలను నాటి, మొక్కల ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు. ఎన్ఎస్ఎస్ పిఒ ఎస్.వి.రమణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్: నగరంలోని పిఎస్ఎన్ఎం స్కూల్‌లో లైన్స్‌క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ ఆధ్వర్యాన మొక్కలు నాటారు. ప్రతివ్యక్తి మొక్క నాటడంతో పాటు సంరక్షించాల్సిన బాధ్యతను తీసుకోవాలని అధ్యక్షులు డాక్టర్ బొడ్డేపల్లి సురేష్ అన్నారు. కార్యక్రమంలో రెండవ పట్టణ సిఐ జి.ఉమా మామహేశ్వరరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ గురువును ప్రతిఒక్కరూ దైవంగా భావించిన నాడే ఉన్నత శిఖరాలు అందుకోగలరన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి డా. పైడి సింధూర, ట్రెజరర్ జోగి భారతి, జోనల్ చైర్మన్ పొన్నాడ రవికుమార్, బి.దేవభూషన్, మెంటార్ నటుకుల మోహన్, పాఠశాల హెచ్‌ఎం భాస్కర్ పాల్గొన్నారు.



పుష్పగుచ్ఛం అందజేస్తున్న గోవిందరావు

సిఎంను కలిసిన ఎమ్మెల్యే ఎంజిఆర్

పాతపట్నం: ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు విజయనగరం జిల్లా భోగాపురం గ్రీన్‌ఫీల్డ్ అంతర్జాతీయ విమానాశ్రయం పనులను పరిశీలించేందుకు గురువారం వచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడును కలిశారు.



మంత్రి అచ్చెన్నాయుడుతో తేజేశ్వరరావు

మంత్రిని కలిసిన తేజేశ్వరరావు

ప్రజాశక్తి- పాతపట్నం

వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడును బిజెపి నాయకులు సిరిపురం తేజేశ్వరరావు కలిశారు. విజయవాడ కరెన్సీ కాలనీ నివాసంలో మంత్రిని గురువారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. పాతపట్నం నియోజకవర్గంలోని పలు సమస్యలను పరిష్కరించాలని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనింపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

రేపు నందిగాం మండల సమావేశం

ప్రజాశక్తి- నందిగాం

స్థానిక మండల ప్రజాపరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండల సమావేశం నిర్వహిస్తున్నామని ఎంపిడిఒ టి.రాజారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపిపి నడుపూరు శ్రీరామ్మూర్తి అధ్యక్షతన ఉదయం 10 గంటలకు ప్రారంభి స్తామని అన్నారు. విధిగా సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, పూర్తి సమాచారంతో మండల అధికారులు పాల్గొవాలని సూచించారు.



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు ఉమాగౌరీ

34 మందికి వైద్య పరీక్షలు

పాతపట్నం : మండలంలోని పెద్దలక్ష్మీపురం పంచాయతీలో సర్పంచ్ అన్నెపు ఉమామహేశ్వరరావు ఆధ్వర్యాన గురువారం హోమియో వైద్య శిబిరం నిర్వహించారు. తెంబూరు హోమియో వైద్యులు ఉమాగౌరీ, సిహెచ్‌సి వైద్య సిబ్బంది 34 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ వైద్యుల సూచించిన మందులను తప్పక వాడాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి, ఎఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



జెండాను ఆవిష్కరిస్తున్న చంద్రమోహన్

జనసేన పతాకావిష్కరణ

ప్రజాశక్తి- నందిగాం

మండలంలోని కవిటిఅగ్రహారంలో జనసేన పార్టీ జండా జిల్లా అధ్యక్షులు పిసిని చంద్రమోహన్ గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గం జనసేన ఇన్‌ఛార్జి కణితి కిరణ్‌కుమార్, పలాస నియోజకవర్గ ఇన్‌ఛార్జి వేగుల దుర్గారావు, నందిగా మండల అధ్యఒఉలు తాడేల చిరంజీవి, టిడిపి కూటమి నాయకులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న నాగరాజు

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన

ప్రజాశక్తి- పాతపట్నం

ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలతో ఆరోగ్యంతో పాటు నీటి సంరక్షణ, జీవవైవిధ్యాన్ని ప్రోత్సహించడం, వాయు కాలుష్యం తగ్గించిన వారమవు తామనిఏరియా కో-ఆర్డినేటర్ ఎ.నాగరాజు అన్నారు. మండలంలోని శోభ పంచాయతీ కరడాసింగి గూడలో ఆదివాసీ రైతులకు ప్రకృతి వ్యవసాయంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో ఖర్చు తక్కువ, ఫలితం ఎక్కువ, ఆరోగ్యకరమైన పంటలు అందరికీ అందుబాటులోకి తెచ్చిన వారమవు తామన్నారు. కార్యక్రమంలో రిసోర్స్‌పర్సన్లు ఎ. చిరంజీవి, శ్రీను, జి.జగన్, ఎస్.కామేశ్వరరావు పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న ప్రొక్లెయినర్

నౌపడలో పారిశుధ్య పనులు

నౌపడ : సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీలో టిడిపి నాయకులు సుగ్గు శాంతి స్వరూప్ రెడ్డి ఆధ్వర్యాన ప్రొక్లెయినర్ యంత్రాలతో గురువారం పారిశుధ్య పనులు నిర్వహించారు. రోడ్లకు ఇరువైపులా చెత్త, ముళ్ల తుప్పలు తొలగించి జంగిల్ క్లియరెన్స్ చేశారు. కోమటి వీధి, పెద్దవీధి, కర్రి వీధి, కొత్త వీధిలలో కాలువలో పేరుకుపోయిన మట్టిని తొలగించి వరద నీటికి కాలు ఏర్పాటు చేశారు. పరిశుభ్రత ప్రజారోగ్యంగా పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు బాలకృష్ణ, శంకర్, హేమారావు, రాజా, నీలిమోహన్ పాల్గొన్నారు.

గర్భిణులకు పోషకాహారం

లావేరు: లావేరు పిహెచ్‌సిలో గురువారం ప్రధాన మంత్రి సురక్షిత్ మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా నలభై మంది గర్భిణులకు పోషకాలతో కూడిన ఆహారాన్ని బెజ్జిపురం యూత్‌క్లబ్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. గర్భిణీలు పోషకాలతో కూడిన ఆహారం తీసుకోవాలని పిహెచ్‌సి వైద్యాధికారిణి మౌనిక అన్నారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, యూత్‌క్లబ్ సిబ్బంది శ్రీనువాసరావు, ఉట్ట దుర్గారావు, గొర్లె త్రినాథ్, కలిశెట్టి వెంకట రమణ తదితరులు పాల్గొన్నారు.



గర్భిణులకు పోషకాహారం అందజేస్తున్న యూత్ క్లబ్ సిబ్బంది